ఇరిగేషన్ ఉన్నతాధికారులతో రాహుల్‌బొజ్జా భేటీ

హైదరాబాద్, జనవరి8 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర సాగునీటి పారుదలశాఖ కార్యదర్శిగా నియామకమైన రాహుల్‌బొజ్జా తొలిసారిగా ఇరిగేషన్ ఉన్నతాధికారులతో సోమవారం భేటీ అయ్యారు. జలసౌధకు విచ్చేసిన ఆయనకు ఈఎన్సీ మురళీధర్, నాగేందర్‌రావు, అనిల్‌కుమార్, హరిరామ్ తోపాటు పలువురు అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఇరిగేషన్ అధికారులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాజెక్టులు, వాటి పురోగతితోపాటు పలు అంశాలపై అధికారులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. రాహుల్‌బొజ్జాను హైదరాబాద్ ఇంజినీర్స్ అసోసియేషన్ నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

గోల్ఫ్ కోర్సు భూమిపై వివరాలివ్వండి

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): గోల్కొండ సమీపంలో హైదరాబాద్ గోల్ఫ్ కోర్సు అసోసియేషన్‌కు భూమి కేటాయింపు, గోల్ఫ్ కోర్సు ఏర్పాటు ఇతర విషయాలపై నివేదిక సమర్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హైకోర్టు ఆదేశించింది. గోల్కొండకు సమీపంలోని జమాలికుంట, నాయా ఖిల్లా ప్రాంతాల్లోని భూమిని గోల్ఫ్ కోర్సుకు ఉమ్మడి ఏపీ ప్రభుత్వం కేటాయించింది. చారిత్రాత్మక గోల్కొండ కోట ప్రత్యేకత దెబ్బతింటుందంటూ పీపుల్స్ యూనియన్ ఫర్ సివిక్ యాక్షన్ అండ్ రైట్స్ ఫోరం ఫర్ బెటర్ హైదరాబాద్ అనే సంస్థ 2008లో హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేసింది. దీనిని సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. గోల్ఫ్ కోర్సు నిర్మాణాల పేరుతో ఎలాంటి పేల్చళ్లకు పాల్పడొద్దని, పనులు నిర్వహించొద్దని గతంలోనే హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఆ తర్వాత గోల్ఫ్ మైదానంలో పచ్చిక ఏర్పాటుకు అనుమతించింది. ఉత్తర్వులను ఉల్లంఘించి పనులు నిర్వహిస్తున్నారని పిటిషనర్ న్యాయవాది చెప్పారు. దీనిపై హైకోర్టు కేంద్ర, రాష్ట్రాల పురావస్తు శాఖలను ఆదేశించింది. తదుపరి విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది.

కృష్ణా బోర్డు పరిధిలోకి సాగర్‌డ్యామ్

- ఏపీకి నీటిని వదిలిన బోర్డు అధికారులు
- నేడు ఇరు రాష్ట్రాలతో కేఆర్‌ఎంబీ భేటీ

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్‌ఎంబీ) నాగార్జునసాగర్ డ్యామ్‌ను తాత్కాలికంగా తన ఆధీనంలోకి తీసుకున్నది. సాగర్ కుడి కాలువ ద్వారా సోమవారం ఏపీకి నీటిని విడుదల చేసింది. సాగర్ నుంచి 5 టీఎంసీల నీటిని విడుదల చేయాలని కేఆర్‌ఎంబీకి ఏపీ ప్రతిపాదనలు చేసింది. దీనిపై అభిప్రాయం తెలపాలని బోర్డు తెలంగాణకు లేఖ రాయగా, బోర్డే నిర్ణయం తీసుకోవాలని తెలిపింది. ఈ నేపథ్యంలో ఏపీకి 5 టీఎంసీలను విడుదల చేయాలని కేఆర్‌ఎంబీ నిర్ణయించింది. చట్టప్రకారం సాగర్ నుంచి నీటిని విడుదల చేసే బాధ్యత తెలంగాణకే ఉన్నది. ప్రస్తుతం కుడి కాలువ ఏపీ ఆధీనంలో ఉంది. తామే ఏపీకి నీటిని విడుదల చేస్తామని తెలంగాణ ఈఎన్సీ మురళీధర్ వెల్లడించారు. కేఆర్‌ఎంబీ చైర్మన్ శివనందన్‌కుమార్‌ను స్వయంగా కలిసి స్పష్టంచేశారు. ఒకవేళ అది కుదరకపోతే బోర్డు అధికారులే నీటిని విడుదల చేయాలని వాదించారు. దీంతో కేఆర్‌ఎంబీ చైర్మన్ హుటాహుటినా బోర్డు సభ్యులను సాగర్‌కు పంపించారు. బోర్డు సభ్యులతో కుడికాలువ గేట్లనుఎత్తించి నీటిని విడుదల చేశారు. ఈ అంశంపై మంగళవారం ప్రత్యేకంగా ఇరు రాష్ట్రాల అధికారులతో సమావేశం నిర్వహించాలని బోర్డు నిర్ణయించింది. ఈ మేరకు ఏపీ, తెలంగాణకు సమాచారం అందించింది.

గోదావరి-కావేరి అనుసంధానికి ఛత్తీస్‌గఢ్ ఓకే

హైదరాబాద్, జనవరి8 (నమస్తే తెలంగాణ): గోదావరి-కృష్ణా- పెన్నా- కావేరి ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సంసిద్ధత తెలిపింది. దీంతో ప్రాజెక్టు కీలక దశకు చేరుకున్నట్లయింది. ఈ మేరకు ముసాయిదా డీపీఆర్‌కు (నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎన్‌డబ్ల్యూడీఏ) ఆమోదించింది. త్వరలోనే డీపీఆర్‌ను రాష్ట్రాలకు పంపి, అనంతరం సీఎంలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి.. ఎంవోయూ కుదుర్చుకోవాలని ఎన్‌డబ్ల్యూడీఏ చూస్తున్నది. గోదావరి-కావేరి అనుసంధానంలో భాగంగా 148 148 టీఎంసీలను తామే పూర్తిగా వినియోగించుకొంటామని, ఆ మేరకు ఇప్పటికే ప్రణాళికలు రూపొందించుకున్నామని ఛత్తీస్‌గఢ్ స్పష్టం చేసింది.

తల్లి బలహీనత బిడ్డకు ప్రమాదం

- తెలుగు రాష్ట్రాల్లో 33శాతం మంది పిల్లల్లో రక్తహీనత
- ఎన్‌ఐఎన్ అధ్యయనంలో వెల్లడి

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 8 (నమస్తే తెలంగాణ): 'గర్భవతి బలహీనత, ఆమె గర్భస్థ శిశువు ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. పుట్టినప్పటి నుంచి ఐదేండ్ల వరకు ఎదుగుదల లోపించే అవకాశం ఉంది. గర్భిణి అధిక రక్తహీనతతో బాధపడుతుంటే పుట్టబోయే బిడ్డ బరువు నిర్దిష్ట ప్రమాణాల కంటే తక్కువగా ఉంటుంది' అని జాతీయ పోషకాహార సంస్థ (ఎన్‌ఐఎన్) తెలిపింది. తెలుగు రాష్ట్రాల్లో ఈ ప్రభావం 33 శాతం మేర ఉన్నట్టు తమ అధ్యయనంలో తేలిందని పేర్కొంది. మొత్తం 10,350 మంది చిన్నారుల బరువు, ఎత్తును పరిశీలించి ఈ నిర్ధారణకు వచ్చినట్టు తెలిపింది. బాలికలు, మహిళల్లో రక్తహీనత అత్యంత ప్రమాదకారిగా మారుతున్నది. ఎన్‌ఐఎన్ పరిశీలనలో 33 శాతం మంది వయస్సుకు తగినంత ఎత్తు, ఎత్తుకు తగ్గ బరువు లేరని తేలింది. ఈ సమస్య పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో పెరిగే పిల్లల్లోనూ ఉన్నట్టు వెల్లడైంది. పోషకాహార లోపం కారణంగా చిన్నారులు బరువు పెరగడం లేదని గుర్తించారు. శారీరక ఎదుగుదలకు అవసరమైన పోషకాలు అందకపోవడంతో వారిని ఊబకాయం కూడా వేధిస్తున్నట్టు పరిశోధకులు పేర్కొన్నారు. మెజార్టీ పిల్లల రక్తంలో ఐరన్ లోపం ఉందని తేల్చారు. దీనంతటికి కారణం వారు గర్భంలో సమయంలో వారి తల్లి రక్తహీనత కారణమని తేల్చారు.

పట్టణాల్లోనూ రక్తహీనత...

పట్టణాలు, నగరాల్లో నివసించే చిన్నారుల్లోనూ రక్తహీనత పెరగడం ఆందోళన కలిగించే విషయమని ఎన్‌ఐఎన్ పరిశోధకులు పేర్కొన్నారు. తాము 10,350 మంది చిన్నారుల ఆరోగ్య స్థితిగతులను పరిశీలించగా.. పట్టణాల్లోనే 33.8 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నారని తెలిపారు.

కుక్కల దాడిలో చిన్నారి మృతి

- నిజామాబాద్ జిల్లాలో ఘటన

మాక్లూర్, జనవరి 8: నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం కల్లడి గ్రామంలో విషాదం నెలకొన్నది. కల్లడికి చెందిన బండా రిమధు- రజని దంపతుల పెద్ద కొడుకు హర్షవర్ధన్ తన తాత ధర్మయ్యతో కలిసి డిసెంబర్ 25న పొలానికి వెళ్లి ఆడుకుంటుండగా రెండు కుక్కలు దాడి చేశాయి. హర్షవర్ధన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. జిల్లా ప్రభుత్వ దవాఖానలో చికిత్స చేయించారు. 3 రోజులుగా జ్వరంతోపాటు వాంతులవడంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మరణించాడు.

ఏసీబీకి చిక్కిన ట్రాన్స్‌కో ఏఈ

- లంచం తీసుకొంటూ దొరికిన రాజు

కామారెడ్డి, జనవరి 8: వాహనాల అద్దె బిల్లులు చెల్లించేందుకు కాంట్రాక్టర్ వద్ద లంచం తీసుకుంటూ కామారెడ్డి ట్రాన్స్‌కో ఏఈ రాజు ఏసీబీ అధికారులకు చిక్కాడు. ఏసీబీ డీఎస్పీ ఆనంద్ వెల్లడించిన వివరాల ప్రకారం.. భైరవస్వామి అనే వ్యక్తి రెండు వాహనాలను ట్రాన్స్‌కోకు అద్దెకిచ్చారు. నెలకు ఒక్కో వాహనానికి రూ.61 వేల అద్దెతో అగ్రిమెంట్ చేసుకున్నారు. ట్రాన్స్‌కో ఏఈ రాజు బిల్లు చేయాల్సి ఉంటుంది. మూడు బిల్లు చెల్లించేందుకు రూ.12,500 డిమాండ్ చేయగా భైరవస్వామి ఏసీబీని ఆశ్రయించారు. అయితే లంచం డబ్బులను తన స్నేహితుడు సంతోష్ అనే వ్యక్తికి ఓ జిరాక్స్ సెంటర్‌లో ఇవ్వాలని భైరవస్వామికి ఏఈ రాజు సూచించాడు. ఆ మేరకు సంతోష్‌కు డబ్బులు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏఈ రాజు, అతని స్నేహితుడు సంతోష్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేపడుతున్నట్టు ఏసీబీ డీఎస్పీ ఆనంద్ తెలిపారు.

వైఎస్ మృతికి సోనియా కారణమనడం సరికాదు

ఏపీ డిప్యూటీ సీఎం నారాయణస్వామిపై మల్లు రవి ఫిర్యాదు

సుల్తాన్‌బజార్,జనవరి 8: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణానికి కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ కారణమని ఏపీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నేత మల్లు రవి డిమాండ్ చేశారు. నారాయణస్వామిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం హైదరాబాద్‌లోని బేగంబజార్ పోలీస్‌స్టేషన్‌లో మల్లు రవి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వాతావరణం అనుకూలించక హెలికాప్టర్ కూలి వైఎస్ చనిపోయారని గుర్తుచేశారు. దీనికి సోనియాగాంధీ కారణం ఎలా అవుతారని ప్రశ్నించారు. నారాయణస్వామి వ్యాఖ్యలు సరికాదని, వాటిని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోషల్ మీడియాలో ఈ అవాస్తవైన వార్తను వైరల్ కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఇన్‌స్పెక్టర్ నమిండ్ల శంకర్‌కు తెలిపినట్టు వివరించారు.

రాజమండ్రిలో కాంగ్రెస్ మాజీ ఎంపీల భేటీ

- రాష్ట్ర విభజనతోనే రాజకీయ జీవితం ముగిసింది
- మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ వెల్లడి

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర విభజన తర్వాత రాజకీయాలకు దూరంగా ఉంటున్న మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ మరోసారి తెరపైకి వచ్చారు. చాలా రోజుల తర్వాత కాంగ్రెస్ మాజీ ఎంపీలతో సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ మరోసారి యాక్టివ్ అవుతున్న సమయంలో వీరి భేటీ చర్చనీయాంశంగా మారింది. సోమవారం రాజమండ్రిలో మాజీ ఎంపీలు జీవీ హర్షకుమార్, ఉండవల్లి అరుణ్‌కుమార్‌ను లగడపాటి కలిశారు. రాష్ట్ర విభజన నుంచి ఆయన రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. హర్షకుమార్‌ను కలిసిన సమయంలో ఏపీ రాజకీయాలపై స్పందించారు. తాను ఎన్నికల్లో పోటీ చేయనని స్పష్టం చేశారు. రాజకీయాలకు దూరంగా ఉన్నానని, రాష్ట్ర విభజనతోనే తన రాజకీయ జీవితం ముగిసిందని తెలిపారు. రాజమండ్రి వచ్చిన సమయంలో హర్షకుమార్, ఉండవల్లిని కలవడం మామూలేనని వెల్లడించారు. వైఎస్ షర్మిల కాంగ్రెస్‌లో చేరడంపై బెట్ట్ ఆఫ్ లక్ చెప్పారు. 2019లో టీడీపీలో చేరిన హర్షకుమార్ టికెట్ దక్కకపోవడంతో మళ్లీ కాంగ్రెస్‌లో చేరినా పెద్దగా యాక్టివ్‌గా లేరు.

రుణ వివరాలు చూపుతూ బతికే ఉన్నానంటున్న శంకర్

నేను బతికే ఉన్నా.. రుణ మాఫీ చేయండి

నల్లగొండ, జనవరి 8 : 'నేను బతికే ఉన్నా.. చనిపోలేదు.. నా పేరుతో తీసుకున్న రుణాన్ని మాఫీ చేయాలి' అని ఓ రైతు నల్లగొండ కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం ఊట్కూరుకు చెందిన నల్లగంటి శంకర్ అనే రైతు 2016లో శాలిగౌరారం ఎస్‌బీఐలో 40 వేల పంట రుణం తీసుకున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 50 వేల లోపు రుణాన్ని మొదటి విడతలో మాఫీ చేసింది. శంకర్ పేరుమీద కూడా మాఫీ వచ్చినప్పటికీ వ్యవసాయ శాఖ రికార్డుల్లో ఆయన చనిపోయినట్టు నమోదైంది. దాంతో ఆ మాఫీ డబ్బు వెనక్కి వెళ్లాయి. ఇటీవల రుణం కోసం అదే బ్యాంకుకు వెళ్లిన శంకర్‌కు అసలు విషయం తెలిసి విస్తుపోయాడు.

కన్నతండ్రి కర్కశత్వం

- బిడ్డలను అమ్మేందుకు యత్నం
- పోలీసులను ఆశ్రయించిన తల్లి
- ఫోన్ లొకేషన్ ఆధారంగా పట్టివేత
- తల్లి వద్దకు చేరిన ముగ్గురు పిల్లలు
- దుండగుడికి దేహశుద్ధి

రఫీక్‌కు దేహశుద్ధిచేస్తున్న కుటుంబ సభ్యులు

జడ్చర్ల టౌన్, జనవరి 8: చెడు వ్యసనాలకు అలవాటుపడిన ఓ వ్యక్తి కన్న బిడ్డలను ఎత్తుకెళ్లి అమ్మేందుకు యత్నించిన ఘటన సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో వెలుగు చూసింది. భూత్పూరు మండలం తాడిపర్తికి చెందిన రఫీక్, హబీబున్నీసా దంపతులకు ముగ్గురు సంతానం. వీరు జడ్చర్లలో నివాసం ఉంటున్నారు. రఫీక్ చెడు వ్యసనాలకు బానిస కావడంతో నెలల తరబడి ఇంటికి రాకుండా వివిధ ప్రాంతాల్లో తిరిగేవాడు. భార్యాపిల్లలను తరచూ వేధించేవాడు. ఆదివారం మధ్యాహ్నం భార్యతో గొడవ పడ్డాడు. ఆ తరువాత తన ముగ్గురు పిల్లలు రుమానాబేగం (7), రమీజ్(3), షోయబ్(2)కు చాక్లెట్లు ఇప్పిస్తానని చెప్పి బైక్‌పై తీసుకెళ్లాడు. అనుమానం వచ్చిన హబీబున్నీసా పోలీసులను ఆశ్రయించారు. మొబైల్ లోకేషన్ ఆధారంగా హైదరాబాద్ యాకత్‌పుర రైల్వేస్టేషన్ వద్ద ఉన్నట్టు గుర్తించారు. బాధితురాలితోపాటు ఆమె బంధువులను అప్రమత్తం చేసి అర్ధరాత్రి రఫీక్‌ను పట్టుకున్నారు. అతడి వద్ద పిల్లలు లేకపోవడంతో పోలీసులు నిలదీశారు. బహదూర్‌పురలో ఓ వ్యక్తి వద్ద పిల్లలను ఉంచినట్టు తెలిపాడు. పోలీసులు అక్కడికి వెళ్లి చిన్నారులను క్షేమంగా తీసుకొచ్చి తల్లికి అప్పగించారు. జడ్చర్లలో రఫీక్‌కు కుటుంబ సభ్యులు దేహశుద్ధి చేయగా.. ముగ్గురు పిల్లలను రూ.9 లక్షలకు అమ్మకానికి పెట్టానని, గోవాకు తరలించనున్నట్టు చెప్పడంతో వారు కంగుతిన్నారు.

పాట వైరల్ కావడం మన చేతిలో ఉండదు

ఆస్కార్ పురస్కారాన్ని గెలుచుకొని తెలుగు పాటను విశ్వవేదికపై సగర్వంగా నిలబెట్టారు ప్రముఖ సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణి. ప్రస్తుతం ఆయన నాగార్జున 'నా సామిరంగ' చిత్రానికి సంగీతాన్నందించారు. విజయ్ బిన్ని దర్శకత్వం వహించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా సుస్వరాల బాణీ ..ఎం.ఎం.కీరవాణి సోమవారం పాత్రికేయులతో పంచుకున్న విశేషాలు..

- కెరీర్ ఆరంభం నుంచే నేను సెలెక్టివ్‌గా సినిమాలు చేస్తున్నా. ఆస్కార్ విజేతగా నా మ్యూజిక్ ప్రభావం 'నా సామిరంగ' సక్సెస్‌పై ఉంటుందా అని అడుగుతున్నారు. నా దృష్టిలో ఆస్కార్ పురస్కారం సినిమా సక్సెస్‌ను నిర్ధేశించలేదు.
- సినిమా సక్సెస్ కావాలంటే..డైరెక్టర్ బాగా తీయాలి, నేను కూడా మ్యూజిక్‌పరంగా బాగా వర్క్ చేయాలి..మేము చేసిన పని జనాలకు కనెక్ట్ కావాలి. అప్పుడే విజయం సాధ్యమవుతుంది. ఇక నాగార్జునతో పనిచేయడం నాకు అలవాటైన విద్య. మా కాంబినేషన్‌లో అన్నీ సక్సెస్‌లే ఉన్నాయి. 'నా సామిరంగ' కూడా అదే తరహాలో విజయం సాధిస్తుందని నమ్మకంగా ఉన్నా.
- నాగార్జునతో ప్రెసిడెంట్‌గారి పెళ్లాం, అల్లరి అల్లుడు మొదలుకొని అన్నమయ్య, శ్రీరామదాసు వంటి భక్తిరస చిత్రాలను చేశాను. 'ప్రెసిడెంట్‌గారి పెళ్లాం' గ్రామీణ నేపథ్య కథ. 'నా సామిరంగ' కూడా అలాంటి సినిమానే. ఈ రెండు చిత్రాల్లో చక్కటి వినోదం ఉంటుంది. అందుకే ఆ సినిమా స్థాయిలోనే 'నా సామిరంగ' విజయం తథ్యమని నమ్ముతున్నా.
- 'నా సామిరంగ' టైటిల్ నాగార్జునకు చక్కగా కుదిరింది. తెలుగు సంప్రదాయం, సంస్కృతి, మనవైన ఆచారాలు, సంక్రాంతి పండగ కళ ఉట్టిపడేలా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. సంగీతం కూడా చాలా కొత్త ఫీల్‌తో ఉంటుంది.
- దర్శకుడు విజయ్ బిన్ని కొత్తవాడైనా సినిమా మేకింగ్‌తో పాటు మ్యూజిక్ విషయంలో మంచి అవగాహన ఉంది. తను కొరియోగ్రాఫర్ అయినప్పటికీ డ్యాన్స్ కోణంలో ఆలోచించకుండా మెలోడీ ప్రధానంగా మూడు పాటలను చేయించాడు. ఎంతో అనుభవజ్ఞుడిలా చక్కటి పరిపక్వతతో సినిమాను తెరకెక్కించాడు.
- ఇప్పుడు ఓ పాట ఎంతలా వైరల్ అయితే అదే విజయానికి కొలమానం అనే భావన ఉంది. వాస్తవానికి పాట వైరల్ కావడం మన చేతిలో లేదు. ఒకప్పుడు పెళ్లి బ్యాండ్‌లో ఒక పాటను పదే పదే ప్లే చేస్తే దాన్ని హిట్ పాట క్రింద లెక్కకట్టేవాళ్లు. ఇప్పుడు వ్యూస్‌ను బట్టి నిర్ణయిస్తున్నారు. నా వరకు నిజాయితీగా పనిచేయడం గురించి మాత్రమే ఆలోచిస్తా. పాట వైరల్ కావడం అనేది మన చేతిలో ఉండదు.
- ఇటీవలకాలంలో 'యానిమల్' మ్యూజిక్ బాగుంది. అలాగే 'జైలర్' నేపథ్య సంగీతం బాగా నచ్చింది. ఆ ఇద్దరు సంగీత దర్శకులను అభినందిస్తూ మెసేజ్ కూడా పెట్టాను. రాజమౌళి-మహేష్‌బాబు సినిమాకు సంబంధించిన మ్యూజిక్ వర్క్ ఇంకా మొదలుకాలేదు. ఇక 'హరిహరవీరమల్లు' సినిమాకు మూడు పాటలు రికార్డ్ చేశాం. చిరంజీవి సినిమాకు మ్యూజిక్ సిట్టింగ్స్ మొదలయ్యాయి.

రక్తపుటేరుల ఎర్రసముద్రం

అగ్ర హీరో ఎన్టీఆర్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'దేవర' నిర్మాణం నుంచే ఇటు ప్రేక్షకులతో పాటు అటు ఇండస్ట్రీ వర్గాల్లో కూడా ఆసక్తినిరేకెత్తిస్తున్నది. కొరటాల శివ దర్శకత్వంలో రెండు భాగాలుగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. తొలిభాగం ఏప్రిల్ 5న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది. జాన్వీకపూర్ కథానాయికగా నటిస్తున్నది. సోమవారం ఈ సినిమా ఫస్ట్‌గ్లింప్స్‌ను విడుదల చేశారు. సముద్రం నేపథ్యంలోని పోరాట ఘట్టాలతో గ్లింప్స్ ఉత్కంఠగా సాగింది. ఎన్టీఆర్ రౌద్రరసపూరిత అభినయంతో ఆకట్టుకున్నారు. విజువల్స్ అంతర్జాతీయ ప్రమాణాలతో కనిపించాయి. ఎర్ర సముద్రంలో ప్రత్యర్థులను ఊచకోత కోస్తూ రక్తపాతం సృష్టిస్తూ ఫెరోషియస్ లుక్‌లో కనిపించారు ఎన్టీఆర్. 'ఈ సముద్రం చేపల కంటే రక్తాన్నే ఎక్కువగా చూసింది అందుకే దీన్ని ఎర్ర సముద్రం అంటారు' అంటూ ఎన్టీఆర్ చెప్పిన డైలాగ్ హైలైట్‌గా నిలిచింది. ప్రకాష్‌రాజ్, శ్రీకాంత్, టామ్ షైన్ చాకో, నరైన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రాన్ని నందమూరి కల్యాణ్‌రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ పతాకాలపై మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ కె నిర్మిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ స్వరకర్త.

నిశ్చితార్థ వార్తలన్నీ అబద్ధం

అగ్ర నాయకానాయికలు విజయ్ దేవరకొండ-రష్మిక మందన్న ప్రేమలో ఉన్నారంటూ గత కొంతకాలంగా వార్తలొస్తున్న విషయం తెలిసిందే. 'గీత గోవిందం' 'డియర్ కామ్రేడ్' చిత్రాల్లో కలిసి నటించిన ఈ జంట పర్సనల్ లైఫ్‌లో చాలా సన్నిహితంగా ఉంటారు. ఇరు కుటుంబాల మధ్య కూడా చక్కటి స్నేహసంబంధాలున్నాయి. ఈ నేపథ్యంలో వీరిద్దరి లవ్ ఎఫైర్‌పై అనేక కథనాలొచ్చాయి. అయితే తాము కేవలం స్నేహితులం మాత్రమేనని, తమ మధ్య ఎలాంటి ప్రేమబంధం లేదని ఈ తారలిద్దరూ అనేక సందర్భాల్లో వివరణ ఇచ్చారు. అయినా సోషల్‌మీడియాలో వార్తలు ఆగడం లేదు. ఫిబ్రవరి నెలలో విజయ్ దేవరకొండ-రష్మిక మందన్న నిశ్చితార్థం చేసుకోబోతున్నారంటూ పలు జాతీయ వెబ్‌సైట్లలో వార్తలొచ్చాయి. సోషల్‌మీడియాలో కూడా ఈ న్యూస్ బాగా ప్రచారంలోకి వచ్చింది. తాజాగా వీటిపై విజయ్ దేవరకొండ టీమ్ క్లారిటీ ఇచ్చింది. ఆ వార్తల్లో ఎలాంటి నిజం లేదని, సోషల్‌మీడియాలో వస్తున్న వార్తలను నమ్మొద్దని కోరింది. దీంతో ఇప్పటికైతే ఈ నిశ్చితార్థ వార్తలకు ఫుల్‌స్టాప్ పడ్డట్లయింది. ప్రస్తుతం విజయ్ దేవరకొండ..పరశురామ్ దర్శకత్వంలో 'ఫ్యామిలీ స్టార్' చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే.

అనన్య, దిల్‌రాజు, రైటర్ మోహన్

తప్పుడు వార్తలు రాస్తే తాటతీస్తా!

ప్రతి సంక్రాంతి సీజన్‌లో తనను లక్ష్యంగా చేసుకొని కొన్ని వెబ్‌సైట్స్ తప్పుడు వార్తలు రాస్తున్నాయని, ఇకపై అలాంటి అసత్య ప్రచారాలు చేసే వెబ్‌సైట్లను ఏమాత్రం ఉపేక్షించనని..వారి తాటతీస్తానని ప్రముఖ నిర్మాత దిల్‌రాజు హెచ్చరించారు. శ్రీగణపతి సినిమాస్ సంస్థ నిర్మించిన 'శ్రీకాకుళం షెర్లాక్‌హోమ్స్' చిత్ర ఫస్ట్‌లుక్ లాంచ్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తనపై తప్పుడు వార్తలు రాస్తున్న వెబ్‌సైట్లపై దిల్‌రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. ''హనుమాన్' ప్రీరిలీజ్ ఈవెంట్‌లో చిరంజీవి మాట్లాడిన మాటలను కొన్ని వెబ్‌సైట్లు తప్పుగా వక్రీకరించాయి. వ్యూస్ కోసం నాపై విమర్శలు చేస్తూ వాళ్లకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. ఇన్ని రోజులు ఇలాంటి విషయాలపై ఎక్కువగా స్పందించలేదు. చాలా సాఫ్ట్‌గా ఉన్నా. దిల్‌రాజు ఏం చేస్తాడులే అనుకుంటున్నారు. ఈ రోజు నుంచి ఊరుకునే ప్రసక్తిలేదు' అని తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు దిల్‌రాజు. వెన్నెల కిషోర్, అనన్య నాగళ్ల ప్రధాన పాత్రల్లో నటించిన 'శ్రీకాకుళం షెర్లాక్‌హోమ్స్' చిత్రాన్ని కామెడీ థ్రిల్లర్‌గా తెరకెక్కించామని, చక్కటి వినోదంతో ఆకట్టుకుంటుందని దర్శకుడు రైటర్ మోహన్ తెలిపారు. ఆద్యంతం చక్కటి కామెడీతో ఈ సినిమా మెప్పిస్తుందని నిర్మాత వెన్నపూస రమణారెడ్డి పేర్కొన్నారు.

పోలీసు వారి హెచ్చరిక

రవికాలె, అజయ్‌ఘోష్, సంజయ్ నాయర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'పోలీస్ వారి హెచ్చరిక'. బాజ్జీ దర్శకత్వం వహిస్తున్నారు. బెల్లి జనార్ధన్ నిర్మాత. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఫైట్ మాస్టర్ సిందూరం సతీష్ నేతృత్వంలో పోరాట ఘట్టాలను తెరకెక్కిస్తున్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'సందేశాత్మక చిత్రమిది. ఇప్పటికే ఎనభైశాతం చిత్రీకరణ పూర్తయింది. ఈ నెలాఖరుకు షూటింగ్ పూర్తిచేస్తాం' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: కొండపల్లి నళినీకాంత్, సంగీతం: గజ్వేల్ వేణు, రచన-దర్శకత్వం: బాజ్జీ.

చిత్రం



వాడొక బ్రేకుల్లేని లారీ

గుంటూరు రౌడీ రమణ...అతనిది కేర్‌లెస్ యాటిట్యూడ్. ఎవ్వరినీ లెక్కచేయడు. 'చూడంగానే మజా వచ్చిందా? హార్ట్‌బీట్ పెరిగిందా? ఈల ఏయాలనిపించిందా?..ఇదీ తన గురించి తాను ఇచ్చుకున్న ఇంట్రడక్షన్. ఇంతకి రౌడీ రమణ గుంటూరులో చేసే హంగామా ఏమిటో తెలియాలంటే 'గుంటూరు కారం' సినిమా చూడాల్సిందే. మహేష్‌బాబు కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఈ నెల 12న విడుదలకానుంది. ఆదివారం థియేట్రికల్ ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఇందులో గుంటూరు రమణగా మహేష్‌బాబు పాత్రను పరిచయం చేశారు. 'మీరు మీ పెద్ద బ్బాయిని అనాథగా వదిలేశారని అంటున్నారు..దానికి మీరేం చెబుతారు' అనే వాయిస్ ఓవర్‌తో ఎమోషనల్‌గా మొదలైన టీజర్..యాక్షన్, కామెడీ అంశాలతో ఆకట్టుకుంది. మహేష్‌బాబు తన దైన శైలి యాక్షన్, సంభాషణలతో మెరిశారు. 'వాడొక బ్రేకుల్లేని లారీ..ఎవడాపుతాడు' అనే ప్రకాష్‌రాజ్ డైలాగ్ హీరో రమణ యాటిట్యూడ్‌ను తెలియజెప్పింది. 'రమణ..నీ లైఫ్ ఒక మిరాకిల్ రా బాబు..' అంటూ మహేష్ తన గురించి చెప్పుకునే పంచ్‌తో ట్రైలర్ ముగిసింది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ (చినబాబు) నిర్మించిన ఈ చిత్రంలో శ్రీలీల, మీనాక్షి చౌదరి కథానాయికలుగా నటించారు. తమన్ సంగీతాన్నందించారు.

సుకుమార్ రైటింగ్స్ కొత్త చిత్రం

వి.యశస్వి, సుకుమ